క్లుప్తంగా

అభినందన

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎం.శివకు 'మొలక' బాలసాహిత్యం పురస్కారం లభించిందని ప్రిన్సిపాల్ ఎం.రాజారాం బుధవారం తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు గాయత్రి ఏప్రిల్ సంచికలో రాసిన బాల గేయానికి చిత్రాన్ని గీసి ప్రశంసా పత్రం అందుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా వారిద్దరిని ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా కేంద్ర బాలసాహిత్య అవార్డు గ్రహీత పత్తిపాక మోహన్, మొలక బాలసాహిత్యం సంపాదకులు తిరునగరి వేదాంత సూరి, గరిపల్లి అశోక్, ట్రస్టు కార్యదర్శి సిరిసిల్ల చందన విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు.

25న నిరుద్యోగ మార్చ్

నారాయణపేట రూరల్ : పాలమూరులో ఈనెల 25న బీజేపీ నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌కు జిల్లా నుంచి పెద్ద ఎత్తున యువత, నిరుద్యోగులు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి ఉద్యోగ నియామకాలు లేక ప్రతి ఇంట్లో యువత ఖాళీగా ఉంటున్నారని, తల్లిదండ్రులకు భారంగా మారామని బాధపడుతున్నారని వాపోయారు. కొన్ని ఉద్యోగ ప్రకటనలు ఇచ్చినట్లే ఇచ్చి కోర్టు కేసులు, లీకేజీలతో వాటిని మళ్లీ నీరుగారుస్తున్నారని అన్నారు. నిరుద్యోగ యువతను అయోమయానికి గురిచేస్తూ, ఆత్మహత్యలకు ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకే నిరుద్యోగ మార్చ్ చేపడుతున్నామని వివరించారు.

నేడు 'ప్రజాపంథా' ఆధ్వర్యంలో ధర్నా

నారాయణపేట టౌన్ : ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణాలు చేసి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గురువారం ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. సొంత స్థలం ఉన్న వారికి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పేదల జీవనం అగమ్యగోచరంగా మారిందన్నారు. 20న మండల కేంద్రాల్లో, 24న జిల్లా కేంద్రంలో ప్రదర్శనలు, ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా జిల్లా కేంద్రానికి చెందిన మైనార్టీ కాలనీ, చిట్టెం నర్సిరెడ్డి కాలనీ ప్రజలకు డబుల్ బెడ్ రూంలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు రంజాన్ కిట్ల పంపిణీ

నర్వ: ప్రభుత్వం తరుపున ముస్లింలకు గురువారం రంజాన్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు నర్వ తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మైనార్టీలు హాజరుకావాలని కోరారు.

కొనుగోలు కేంద్రం

నర్వ: జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం నర్వ పీఏసీఎస్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ డైరెక్టర్‌లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మండల రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వానరం మృతి

మరికల్: విద్యుత్‌షాక్‌తో వానరం మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో ఘటన జరిగింది. వానరం మృతి విషయం తెలుసుకున్న బజరంగ్‌దళ్, యువక మండలి సభ్యులు వైకుంఠ రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఆర్థికసాయం

నారాయణపేట: మండలంలోని బోయిన్‌పల్లి గ్రామంలో చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరో కుటుంబానికి చెందిన బాలుడు మృతి చెందిన ఘటన పై స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ సాయం ప్రకటించగా ఆయన తరపున మార్కెట్ వైస్ చైర్మన్ మన్నె లక్ష్మీకాంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు ఒక కుటుంబానికి రూ. 10 వేలు, మరో కుటుంబానికి రూ. 5 వేలు అందజేశారు. ఈ మేరకు సర్పంచ్ త్రివిక్రమ్‌రావు, లక్ష్మీపూర్ సర్పంచ్ రామ్మోహన్, చిన్న జట్రం సర్పంచ్ బాలప్ప, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల యువత అధ్యక్షుడు మోహన్‌నాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. అన్ని విధాలుగా ఎమ్మెల్యే అండగా ఉంటానని చెప్పినట్లు వారికి భరోసానిచ్చారు.

పరామర్శ

నారాయణపేట: బోయిన్‌పల్లిలో మంగళవారం ఈతకు వెళ్లి నలుగురు మృతి చెందిన ఘటన తెలుసుకొని బుధవారం డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతిచెందిన వారికి నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు తిరుమలయ్య, ఎండీ గౌస్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు


సివిల్‌లైన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఐస్‌క్రీమ్ వాహనం


జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రి వద్ద..


కొత్త బస్టాండ్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే మొబైల్ పౌచ్ వ్యాపారం

- పక్కనే చిరువ్యాపారాలు
- పట్టించుకోని అధికారులు

నారాయణపేట టౌన్ : జిల్లాలోని పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారుల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయం లేకపోవడం, కొందరు చిరువ్యాపారులు వాటికి సమీపంలోనే అమ్మకాలు చేపట్టడం వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచె ఏర్పాటు చేయలేదు. సివిల్ లైన్ రోడ్డులోనూ, కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పక్కనే చిరు వ్యాపారులు అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించాలని అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, వాటికి సమీపంలో చిరువ్యాపారులు అమ్మకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటాం. చిరువ్యాపారులకు విషయంపై అవగాహన కల్పిస్తాం. ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో కాకుండా మరోచోట వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట



మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరాను అందించే ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయని ప్రజలు అంటున్నారు. 25 ఏళ్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడం లేదని, దీంతో ఎన్నోసార్లు మూగజీవాలు అక్కడికి వెళ్లి మృత్యువాత పడ్డాయని చెబుతున్నారు. అంతేకాకుండా పక్కనే నీటి కొళాయి సైతం ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'రైతులకు ఎళ్లవేళలా అండగా ఉంటాం'


ఆర్థిక సాయం అందజేస్తున్న వర్కటం జగన్నాథ్ రెడ్డి

మాగనూర్: రైతులకు ఎళ్లవేళలా అండగా ఉంటామని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి హైలెవల్ కెనాల్ కింద నీరు అందక వరి పంటలు ఎండిపోయిన మండల పరిధిలో వివిధ గ్రామాల రైతులకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ. లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రైతులు ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంతో తమ వంతుగా సాయం అందించామని తెలిపారు. ఈ మేరకు రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఆయనను అభినందించారు.

రంజాన్ కిట్ల పంపిణీ

నర్వ: మైనార్టీల సంక్షేమం కోసం ఎల్లప్పుడు కృషిచేస్తామని వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం నర్వ మసీద్‌లోరంజాన్ కిట్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా మైనార్టీ మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి అనంతరం కిట్లను అందించిన వర్కటంను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏటా రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని మైనార్టీలందరికీ దాదాపు రెండు వేల కిట్లను అందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సాహెబ్‌హుసేన్, ఎస్ఎంసీ చైర్మన్ రఫీ, టైలర్ మౌలాలీ, మైహిమూద్, దౌలత్ తదితరులున్నారు.

23న బసవ పురస్కార ప్రదానోత్సవం

మాగనూర్: నేరడగంలోని పశ్చిమాద్రి విరక్త మఠంలో ఈ నెల 22న పీఠాధిపతి సిద్ధలింగ మహాస్వాముల 1వ పుణ్యస్మరణోత్సవం, సన్మాన కార్యక్రమం, అదేవిధంగా బసవ జయంతిని పురస్కరించుకుని 23న బసవ పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు వివరాలను పంచమ సిద్ధలింగ మహాస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు అవుతున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధుడు అదృశ్యం : కేసు నమోదు

కోస్గి: మండల పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సుబ్యానాయక్ తండాకు చెందిన విస్లావత్ మధునాయక్ (62) అనే వృద్ధుడు ఈ నెల 18న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు బుధవారం వృద్ధుడి భార్య సోనా బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మాగనూర్: మండలంలో వడ్వాట్ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఏపీఓ సత్యప్రకాష్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కూలీలు ఉదయం సమయంలో 7 గంటల లోపు రావాలని అలా అయితే త్వరగా ఇంటికి వెళ్లడానికి వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఏపీఓ సత్యప్రకాష్

'సమాజ సేవ చేసేందుకే రాజీనామా'


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నాయకులు, తదితరులు

మక్తల్: సమాజ సేవ చేసేందుకే ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశానని ఎంఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. మక్తల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో తన పదవీ విరమణ సందర్భంగా బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వృత్తి నిర్వహణలో అందరూ తనకు సహకరించారని అన్నారు. మక్తల్, మాగనూర్, నర్వ, కృష్ణ మండలాలకు ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించానని వివరించారు. సమాజ సేవ చేయాలన్న ఆకాంక్షతోనే 3 సంవత్సరాల ముందుగానే ఉద్యోగానికి రాజీనామా చేశానని వివరించారు. గతంతో ఉన్న ఎమ్మెల్యేలు ఎల్లారెడ్డి, చిట్టెం నర్సిరెడ్డి, దయాకర్‌రెడ్డితో పాటు, ప్రస్తుత ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సహకారంతో బాధ్యతలు చక్కగా నిర్వర్తించానని వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆయనను ఘనంగా సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, డీఈఓ లియాకత్‌అలీ, ఎంపీపీ వనజ, మాజీ ఎంపీపీ కొండయ్య, పీసీసీ సభ్యుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, అనిల్‌గౌడ్, వెంకటవరలక్ష్మి, కృష్ణరెడ్డి, ప్రకాశ్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి, జీహెచ్ఎంలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజులు పని కల్పించాలని సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ వెంకటరామారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నిడుగుర్తి, పెద్దజట్రం గ్రామాల్లో ఉపాధి పనులకు పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు నీటి వసతి, నీడ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెద్దజట్రంలో గత సంవత్సరం పనిచేసిన 150 మంది కూలీలకు ఇప్పటివరకూ డబ్బులు ఖాతాలో జమ కాలేదని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో కూలీ డబ్బులు కూడా పెంచాలని డిమండ్ చేశారు. నాయకులు శంకర్, ఈశ్వర్, కనకారాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న జయానందరెడ్డి

మాగనూర్: మండలంలో చేపట్టిన వీఓఏల సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు బీజేపీ మండల నాయకులు వారికి మద్దతు పలుకుతూ బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు జయానందరెడ్డి మాట్లాడారు. వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. 20 ఏళ్లుగా మహిళా సంఘాల సహాయకులుగా పనిచేస్తున్నా వారి సేవలను గుర్తించకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కనకరాజ్, వీఓఏల సంఘం మండల కార్యదర్శి విష్ణు, కోశాధికారి రఘు, మారుతి, వరలక్ష్మి, మహేశ్వరమ్మ, రవి, వెంకటమ్మ, భాగ్యమ్మ, పావని, కరెప్ప, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మహిళ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కీలక పాత్ర పోషిస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 3వ రోజుకు చేరిన సందర్భంగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం వీఓఏలకు మద్దతుగా నిలుస్తుందన్నారు. వీఓఏల సంఘం నాయకులు బుగ్గప్ప లక్ష్మణ, హన్మంతు, పురుషోత్తం, గోవిందు, వెంకట్‌రెడ్డి, జ్యోతి, రమాదేవి, శ్యామమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మద్దూర్‌లో ధర్నా చేస్తున్న వీఓఏలు

వేసవి తరగతులు రద్దు చేయండి

నారాయణపేట రూరల్ : బీసీ గురుకులాల్లో నిర్వహించ తలపెట్టిన వేసవి శిక్షణ తరగతులను రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో పదోవతరగతి చదవనున్న విద్యార్థులకు ఈ నెల 22 నుంచి మే 10 వరకు ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాం పేరుతో 20 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సొసైటీ కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఉపాధ్యాయులకు సైతం అసౌకర్యంగా ఉంటుందన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదులో జాగ్రత్తలు పాటించాలి

నారాయణపేట రూరల్ : పీఎస్‌లకు వచ్చే ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వర్టికల్ ఇన్‌చార్జ్ సీఐ సీతయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని అన్ని పీఎస్‌లలో టెక్ టీమ్ అధికారులకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి వర్టికల్ అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, కేసుల విషయంలో టెక్నికల్ విషయాలను క్షుణంగా పరిశీలించాలన్నారు. సాంకేతికతను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకోవాలన్నారు. నేరం జరిగిన స్థలంలో లాంగి ట్యూడ్, లాటిట్యూడ్ విధిగా సీడీఎఫ్ ఫామ్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి అంశాన్ని తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది సీసీటీఎన్ఎస్‌పై అవగాహన కల్గిండాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని, పీఎస్‌లో జరిగే ప్రతి విషయాన్ని ఎస్‌హెచ్ఓ దృష్టికి తీసుకునిరావాలన్నారు. పోలీసుశాఖ ఉపయోగించే సీసీటీఎన్ఎస్ 2.0 అప్లికేషన్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సీతయ్య

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేనరేందర్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కోస్గి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం ఆ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే నరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సంఘం భవన నిర్మాణానికి అందజేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష, ఎంపీపీ మధుకర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, రాజేష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రఘునాథ్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ ఏర్పాటు

కోస్గి: ముస్లింలకు రంజాన్‌లో ఏర్పాటు చేసే ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని బుధవారం స్థానిక (షాదిఖానా) ఉర్దుఘర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, ఎంపీపీ మధుకర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, ప్రధాన కార్యదర్శి వెంకట్ నర్సిములు, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, తోపాటు పలువురు మైనార్టీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్దతు ధరలేక ఇళ్లలోనే పత్తి

మరికల్: మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో జిల్లాలోని పలుగ్రామాలకు చెందిన రైతులు ఇప్పటికీ ఇళ్లలోనే పత్తిని నిల్వ ఉంచుతున్నారు. ఓ వైపు గిట్టుబాటు ధర సమస్య, మరోవైపు వేసవిలో పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు రైతుల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. 2021లో వానాకాలం సీజన్‌లో వేసిన పత్తికి భారీగా లాభాలు రావడంతో 2022లో జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా పత్తిని సాగు చేశారు. మొదట్లో కొందరు రైతులు అప్పటి మార్కెట్ ధరలకు అనుగుణంగా అమ్ముకోగా, మరికొందరు ధరలు పెరుగుతాయన్న ఆశతో ఇళ్లలో పత్తి నిల్వ చేసుకున్నారు. కానీ నవంబర్‌లో క్వింటాల్ రూ.9500 ఉన్న ధర ప్రస్తుతం రూ. 7800 పడిపోయింది. దీంతో ఏంచేయాలో రైతులకు అర్థం కావడం లేదు. ఇప్పటికీ చాలా మంది తమ ఇళ్లలో 10 నుంచి 30 క్వింటాళ్ల వరకు పత్తిని నిల్వ ఉంచుకుని ధరలు పెరుగుతాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు.



మరికల్‌లో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి

సోదరభావంతో మెలగాలి : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

మక్తల్: సమాజంలో ప్రతిఒక్కరూ సోదరభావంతో కుల, మత భేదాలు లేకుండా జీవించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో మసీద్ వద్ద ముస్లింలకు ఆయన ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇస్తోందని అన్నారు. ఈసందర్భంగా ఆయనను ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రిడ్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, తహసీల్దార్ తిరుపతయ్య, సీఐ సీతయ్య, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పనులు

అమరచింత: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను చేపడుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు చేపడుతున్నామని చైర్ పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి అన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రతి వార్డులో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మురుగు కాల్వల శుభ్రతతో పాటు చెత్తాచెదారం లేని పట్టణంగా మార్చేందుకు వార్డు కౌన్సిలర్ల సహకారంతో పనులను చేపడుతున్నామన్నారు.